"దైవమా! భూలోకంలో కోట్లమంది జనం ఉన్నారు కదా. మరి నేనా దేవతని ఎలా తెలుసుకుంటాను? కనీసం ఆ దేవత పేరేమిటో చెప్పు."

"ఆమె పేరేదైనా నువ్వు మాత్రం జీవితాంతం ఆమెని 'అమ్మ' అని పిలుచాలు." చెప్పాడు దేవుడు.

## 15. మనలోని దేవుడు

ఈశ్వర సర్వ భూతానాం, సర్వం ఖల్విదం బ్రహ్మ లాంటి ప్రవచనాలు ఓ ఆధ్యాత్మిక ప్రవచనంలో విన్నాక ఒకతను ఇలా అడిగాడు.

"స్వామీ! మీరు ప్రతీ మనిషిలో దేవుడున్నాడని చెప్పారు కదా? మరి కొందరు మనుషులు ఎందుకు దయాహీనంగా, దుర్మార్గంగా ప్రవర్తిస్తారు?"

"వాళ్ళు తమలోని దేవుణ్ని తొక్కిపెట్టి ఉంచుతారు కనుక." చెప్పాడు స్వామి.

ఆ సమాధానంతో అతనికి తృప్తి కలగలేదు. ఆ విషయమే ఆలోచిస్తూ ఇంటికి నడవసాగాడు.

ఓ ముసలి దంపతులు రోడ్డు క్రాస్ చేస్తూండగా, ఓ కారు హారన్ మోగించుకుంటూ, వేగం తగ్గకుండా రావడం ఇంట్లోకి వెళ్తున్న అతను గమనించాడు. ముసలి దంపతులు ఏంచెయ్యాలో తోచక రోడ్డు మీద బిత్తరపోయి చూస్తూ నిల్చుండిపోయారు. అతను పరిగెత్తుకు వెళ్ళి వాళ్ళ చేతులు పట్టుకుని పక్కకి లాగాడు.

"ఇడియట్. కళ్ళు కనబడటం లేదా?" కోపంగా అరిచాడు ఆ కారు డ్రైవర్ మీద.

కారు రివర్స్‌లో వెనక్కి వచ్చి ఆగింది. డ్రైవర్ కోపంగా దిగి అతన్ని ఓ పిడిగుద్దు గుద్దాడు. అతని పెదవి చిట్లి రక్తం రుచి నాలుకకి తెలిసింది.

"ఖబడ్దార్." హెచ్చరించాడా డ్రైవర్.

అతను ఇంట్లోకి పారిపోయాడు. తన భార్యకి జరిగింది టూకీగా చెప్పి, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తెరిచాడు. కొద్దిసేపటికి డోర్ బెల్ మోగింది. డ్రైవర్ కోపం తగ్గక మళ్ళీ వచ్చాడా? వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా నిలబడి వున్నాడా డ్రైవర్. ఏంచేస్తాడో అని అతను భయపడుతుంటే ఆ డ్రైవర్ అతని రెండు చేతులూ పట్టుకుని దీనంగా చెప్పాడు.

"మీకు అపాలజీ చెప్పడానికి వచ్చాను. ఇంటికెళ్ళా, జరిగిందాంట్లో తప్పు ఎవరిదా అని ఆలోచించాను. తప్పంతా నాదే. నేను ట్రాఫిక్ డిసిపి తమ్ముడినన్న అహంతో అలా కొట్టాను. నన్ను క్షమించండి."

డ్రైవర్ వెళ్ళిపోయాక అడిగింది అతని భార్య ఆశ్చర్యంగా.

"ఇంత మంచివాడు ఇందాక ఎందుకలా ప్రవర్తించాడు?"

"అతను ఇందాక తనలోని దేవుడ్ని అణచిపెట్టి వుంచాడు కాబట్టి." విషయం అర్థమైన అతను జవాబిచ్చాడు.

## 16. దేవుడ్ని ఏం కోరాలి?

హిమాలయాల్లో చాలాకాలం తపస్సు చేసుకున్న ఓ మహాయోగి ఓసారి ఓ ఊళ్ళోకి వచ్చి ఒకానొక గుళ్ళో బసచేసాడు.

ఆ ఊరిలో గొప్ప భక్తుడిగా పేరు తెచ్చుకున్న ఒకతను ఆయన దర్శనార్థం వెళ్ళాడు. ఆయన ఆ భక్తుడి వంక తీక్షణంగా చూసి మొహం తిప్పుతున్నాడు.

మిగిలిన అందరితో ప్రసన్నంగా ఉండి, ఒక్క తన విషయంలోనే అయన అలా ప్రవర్తించడం అతనికెంతో ఆశ్చర్యం కలిగించింది.

పైగా తను ఇతరులందరికన్నా దైవాన్ని నియమనిష్టలతో నిత్యం పూజించే భక్తుడాయె! అందులోని అంతరార్థం తెలుసుకోవాలనిపించి ఆ యోగిని ప్రశ్నించాడు.